# పాపఫలం

[కథానిక]

●

= శ్రీ కె. లింగరాజు =

ఆ అగ్రహారంలో నేనూ, మా అన్నా, మా వదినా మా ముసలిఅమ్మతో కాపురం చేసేవారం. మాకున్న ఆస్తులతో కడుపుకూ, చేతికీ లోటు లేకుండా ఉండడంవల్ల క్రమేణా చదువురీత్యా పట్టణవాసంలోకి వచ్చేము. ఆ చదువుకొనే రోజుల్లో, యవ్వనదశ రూపుల్లో నేను విచ్చలవిడిగా, స్వేచ్ఛగా—సంసారం ఆదుకొందుకు మా అన్నగారుండడంవల్ల నాకు బాదరబందీ ఏమీ లేనందున—అల్లా అల్లా కాలాన్ని గడిపేవాడిని. విశ్వవిద్యాలయాల్లో చదువు నేర్చుకొందుకు గుణింతాలు గుణించుకొనేవాడిని.

ఒకప్పుడు పువ్వుల్లో పెరిగినప్పటికీ మావదిన వెనుకటి దర్జా గాని, అధికారం గాని, అహంభావం కాని మాయింటికొచ్చినతర్వాత చీమంతైనా చూపించలేదు. "ఇదంతా నాసంసారం. నే నీదుకోకపోతే నాకొంప, నాపరువు, నాగోడు నిలవవద్దా" అన్న పంథాలో పడి, అన్నిపనులూ తానే చేస్తూ, మాఅమ్మను కాస్త పనైనా చెయ్యనీకుండా కూర్చోపెట్టి, "ఎన్ని నోములు నోచేనో ఇల్లాంటి కోడలు దొరికింది" అంటూ ఆవిడ మొక్కుకొనేటట్టూ, పొగడేటట్లూ చేసింది.

మావదిన ఆకారమూ, రూపురేఖలూ చూచి మా అన్నయ్యకూడా ఎంతో మురిసిపోయేవాడు. ఎంతో సంతోషపడిపోయి కులికేవాడు. డెప్పిపొయ్యకుండా మంచిగా సరదాగా ఉండే వదిన దొరికిందికదా అని నేనూ ఆనందపడేవాణ్ణి. కాని అల్లా చిలకా గోరింకల్లా ఉంటూ, కొద్దికాలంక్రితమే ఒకళ్లనొకళ్లు తెలుసుకొంటూ, అర్థంచేసుకొంటూ, ఆనందించుకొంటూ కాలంగడిపే ఆ దంపతులకు మాఅన్నయ్యకు ఉద్యోగం రావడం హాలాహలంలా పరిణమించింది. దాంతో వాళ్ల ఊహాసౌధాలు, ఆనంద ఆహ్లాదాలు అన్నీ ఒక్కసారిగా గుభెల్లుమని కూలిపోయేయి. దాంతో అప్పుడే చిగురెత్తి, నిగనిగలాడుతున్న నునుమొక్క మాడిపోవలసి వచ్చింది. నిజంగా వాళ్ల ఆ యెడబాటుకు కారణం బానిసత్వము. జీవనోపాధికి శరీరాన్ని కరుడుకట్టించుకొని, మానాన్ని చంపుకొని, జీవచ్ఛవమై చేసే ఊడిగము; స్వాతంత్ర్యపు పొల్లులేమైనా ఉంటే, వాటిని మాడ్చి, తల్లిపిల్ల వేరులదగ్గరనుండి నాశనంచేసే భూతము; సంసారజీవితంలో చూడబోయే స్వర్గతుల్యాలైన ఆనందసౌభాగ్యాలకు గొడ్డలిపెట్టు అయిన దాస్యము; కడుపును సగమాకలితో నింపి, భార్యాపిల్లలను విడతీసి, ఒంటరిగా చేసేసి శరీరంలో ఉండే నెత్తురూ మాంసమూ తినే పిశాచము! దానికి ఆహారమై, దానిదృష్టికి ఆ మొక్క మాడిపోయింది. ఉద్యోగం అయిపోయింది.

* * *

మొదటిరోజుల్లో మావదినకు తన భర్త వెళ్లిపోవడం...అందులోనూ సరిగ్గా ఇద్దరూ కలిసి పట్టుమని పదిరోజులైనా సుఖంగా, పూర్తిగా ఆనందం అనుభవించకుండా విడిపోవడం దుర్భరమైపోయింది. వెళ్లిన తర్వాత మాఅన్నయ్య కనీసం మూడురోజులకొకసారైనా మావదినకు ఉత్తరం రాస్తూవుండేవాడు. ఆ ఉత్తరాల్లో తన మొదటిదశలోని విరహాల నన్నిటిని చక్కగా, రేకెత్తించేటట్టు, హృదయానికి హత్తుకుపోయేటట్లు వ్రాసేవాడు. అప్పుడప్పుడు వాటిని చదువుతూవుంటే నాకు ఎంతో విచారం, జాలి, కోపం,

ఆవేళంకూడావచ్చేది. ఇప్పుడు ఈఅంధజీవితం గడుపుతున్నప్పుడైనా.. ‘ఆకేలా’గా లోపల కుళ్లిపోతున్నా ......ఆవుత్తరాల్లో ఒకట—

“లోకంలో పుట్టడమే తప్పయింది అరూ! చూచేవా మగాడి కిచ్చే శిక్షణ! ఈవిశ్వవిద్యాలయాల్లో చదువు కడుపు మాడబెట్టేటందుకే కాదా! అదైనతర్వాత సగమాకలితో నీగ్రోలకంటె కనీసంగా బ్రతుకుతూ, మానం అన్నది చంపుకొని, తాను మనుష్యుడ ననుటకూడా మరచి గొడ్డులా చాకిరీ చేస్తూవుండడానికేకదా ఆతయారు? అందులో—ఈభూతానికి సుఖంలేక, ఆనందంలేక, తృప్తిలేక, ఆఖరుకు వీథిలో అడుక్కొని కడుపునింపుకొనే భిక్షుకుడి కున్నంతైనా లేక, ఎన్ని జీవులు, ఎందరు దంపతులు, ఎంతమంది గొర్రెల్లా బలిఅయిపోయేరో! ఎంతమంది విరహాల్లో మునిగిపోయి, తమ సుఖాన్ని దీనికి కాటుగ్గా పెట్టేరో! ఎంతమంది సంతతశోకంతో కుళ్లి కృశించి పోయేరో! అల్లా అయిపోయినవారిలో ఇప్పుడు నేను కూడా చేరిపోయేనుకాదూ. నాచేతులారా నిన్ను కూడా దానికి ఎరగా చేసేనుకాదూ. కాని జీవితం అంతా మానవుణ్ణి బ్రతికివుండడానికి నిలపెడుతున్నది ఆశ. దానికొరకు ఎదురుచూస్తూ వుండడమే...అదే కాదూ ప్రతివాడికీ ఈలోకంలో బ్రతికి ఉండమని... అల్లాగే నేనూ అయిపోతున్నాను.”

అని వ్రాసిన ఉత్తరంమాత్రం మరచిపోలేకపోయేవాడిని.

మా ఇల్లు రెండంతస్తుల మేడ. పై అంతస్తుగదిలో కూర్చుంటే ఎదురుగుండా వుండేవారి ఇల్లు అంతా కనపడేది. అందులో జరిగే ప్రతీసంగతీ గోచరమైపోయేది.

అవ్వాళ ఇంట్లో ఏదో పండుగ. కనుక ఫలహారాలతోసహా పుష్టిగా భోజనం చేసి, నాగదిలోకి వచ్చి కూర్చొన్నాను ఆరాత్రి. ఇంట్లో పనులన్నీ చక్కపెట్టి రోజూ కబుర్లు చెప్పేటందుకు వచ్చినట్టే వచ్చింది మావదిన. కుర్చీలో కూర్చొని తాను తీస్తున్న ఆకుల్లో సగం ఆకులూ, పోకపొడుం యిచ్చింది. వేసుకొన్నాను. ఈ కబురూ ఆకబురూ చెప్పింది. ఆఖరున “రాజూ! మీకు తెలుగుబుక్కేమిటి?” అంది. చెప్పేను.

“పొయిట్రీ?” మావదినె స్కూలుఫైనలువరకూ చదివింది. చదువుకొన్నవాళ్లకు ఇదో అలవాటు.

“సెలెక్షన్సు. నవనాథచరిత్రం, సీతారాముల క్రీడాభివర్ణనం, ఫిరదౌసి...”

ఫక్కున నవ్వింది. అల్లా నవ్వుతూనే లేచి అలమారుదగ్గరకి వెళ్లి ఈపుస్తకం ఆపుస్తకం తిరగేసింది.

ప్రతీయువకుడూ తనకు కామం అంటే ఏమిటో తెలిసినతర్వాత సెక్సునుగురించి — తనకు పెళ్లి కాకపోయినా—చాటుగుండా చదవడానికీ, దాన్ని అర్థం చేసుకోడానికీ ప్రయత్నిస్తాడు. రహస్యంగా అవి తెచ్చుకొని—ఎవరేనా చూస్తే సిగ్గు, భయం కనుక—చదువుతాడు. అల్లాగే నేను కొద్దిరోజులక్రితమే చదువుదామని తెచ్చుకొన్న సెక్సుపుస్తకాలు ... హైరన్సులెటర్సు, కొక్కోకం...అన్నీ చాటుగుండా ఎవరేనా కెలుకుతారేమో అన్న భయంతో ముందుగా ఉన్న పుస్తకాల వెనుకాల పెట్టేను.

మావదిన అవన్నీ కదపడానికి మొదలుపెట్టేసరికి నాకు గుండెలు ఆగిపోయేటంతటి భయం, సిగ్గు, అపరాధం చేసినవాడిలా కించ వచ్చేసింది.

తిరగేస్తూ తిరగేస్తూ అవీ తీసింది. పిల్లేగారి... పుస్తకం మొట్టమొదటగా తీసింద.

నవ్వుతూ నాకేసి తిరిగి, కొంటెగా తక్కినవన్నీ తిరగేసింది.

సమీక్ష చెయ్యడం ముగిసింది అనగానే ముసిముసిగానే నవ్వుతూ, కుర్చీలో కూర్చుంటూ “మామంచిపుస్తకాలు చదువుతున్నావే!” అంది.

ఏందెప్పుతుందో, ఏం కోప్పడుతుందో, మా అమ్మతో చెప్పి ఏం తిట్టిస్తుందో, మాఅన్నయ్యకు రాసి ఏం చివాట్లు వేయిస్తుందో అని ఊగిసలాడిపోయి, ఆరాటన చెందుతున్న అశాంతిలో నేను సమాధానం ఏమీ చెప్పలేకపోయేను.

ఒక్కసారిగా దోషికి మేజస్ట్రేటు దగ్గర ప్రతిబింబించే కళలన్నీ ప్రదర్శింపబడ్డాయి నా మొగంలో. దోషినే అయిపోయేనుకూడాను.

మరింతగా ముసిముసినవ్వింది. తర్వాత కొంతవరకూ నిశ్శబ్దంగా కూర్చుంది.

ఏమి ఆలోచిస్తోందో? ఏమిచేస్తుందో?...... డావావిచారణ అయిపోయి ఇక జడ్జిమెంటు చెప్పాతారనేటప్పుడు వాదిప్రతివాదులుపడే ఆందోళన పడ్డాను— ఆస్థితిలో ఎటుప్రక్క న్యాయం మొగ్గుతుందో అని.

గోడమీద గడియారం పదిగంటలూ కొట్టింది దీర్ఘంగా.

"రాజా, నీకోతమాషా చూపిస్తాను రా"అంది.

నిజంగా అప్పుడు "మరచిపోయిందికదా! బ్రతికేనురా జీవుడా"అనుకొన్నాను. లేచివెళ్లేను వెనకాలే. అంతస్తువరండాలోకి తీసుకువెళ్లింది."ఇక్కడ నుంచో" అని, తను ఒక్కర్తిగా చివరవరకూ వెళ్లింది. అక్కడ తాను చూపించదలచిన సన్నివేశము ఉందో లేదో అని చూచిరావడానికి వెళ్లిందికాబోలు.

"ఏమిటా చూపించేది? ఇంత రాత్రివేళ ఏమిటా అంతగా పరికించేది" అనుకొన్నాను. ఆకాశంవైపు చూచేను. చంద్రుడు విచ్చలవిడిగా మబ్బుకౌగిళ్లలో తేలిపోతూ, ప్రయాణం చేస్తున్నాడు—కూడా! రోహిణీ నక్షత్రం వెంటబడుతూంటే. దూరంగా కిచకిచలు... కొద్దిగానే వినిపిస్తున్నాయి. "ఓహో! ఇదికాబోలు చూపిస్తానన్నది! సప్తఋషులు, అరుంధతి, శుక్రుడు... ఇవన్నీ కాబోలు" అనుకొన్నాను — కొద్దిరోజుల క్రిందటే వాట్లనుగురించి మాట్లాడుకొన్నందున.

వచ్చింది. "అన్నీ కనపడ్డాయా?" అన్నాను. నవ్వుకొంటూ "రా" అంది.

చివరవరకూ తీసికెళ్లి, చటుక్కున చెయ్యి పట్టుకొని, రెండోచేత్తో మాఎదురుగా ఉన్న, నూత్నంగా వచ్చిన దంపతుల పడకగదికేసి చూపిస్తూ "చూచేవా" అంది.

చూచేను. ఆగదిలో ఆ భార్యాభర్తలు ఒకళ్ల కౌగిట్లో ఒకళ్లు సొమ్మసిలి, ఇద్దరి శరీరాలూ ఒకటే, ఇద్దరి ఆత్మలూ ఒకటే అన్నట్టుగా ప్రతీఅంగం, ప్రతీకణం, ప్రతీనరం కలిసిపోయినట్లుగా అయిపోయి పెదిమలను కలుపుకొని, ఇంకొకళ్లు చూస్తున్నారేమో అనయినా గమనించకుండా, ఆస్మృతే లేకుండా మైకంలో లీనమై...

నాచేతిమీద వేళ్లు బిగువడ్డాయి. ఒకొక్కవ్రేలే తన స్పర్శతో, తనపట్టుతో లోనున్నకోర్కెలు, ఉద్ధృతం-ఇంకా ఎన్నో బోధించేయి. అడిగేయి. రేకెత్తించేయి.

"వాళ్లు ఎల్లా ఆనందం అనుభవిస్తున్నారో చూచేవా!" కంఠం భేదించింది. అల్లా అంటూనే తన శరీరాన్ని నాకు దగ్గరసా ఆన్చి కౌగిలించుకుంది.

ఆ క్షణంలో నాకు అంబరవీథిని... ఎన్నో తిరిగిపోయేయి. ఒకొక్కరాత్రి నిద్రలేక ఇటు అటు దొర్లిఆడుతూ, ఆపసోపాలు పడుతూ విరహంతో కృశించిపోయిన వదిన... ఇల్లా ఆమె అవస్థలు చూచాయగా కనిపించేయి...జాలి...

ఆమైకంలో ఆమెను దగ్గరసా తీర్చేసుకొన్నాను. కరగిపోయాను కూడాను.

అల్లాటి మైకంలో ... ప్రథమపరిచయంలో తప్పూ ఒప్పూ తెలియనియ్యకుండా నేచేస్తుంది కామం. ఆ మొదటి రోజుల్లో, ఆ ఉద్ధృతంలో ఆ సుఖంలో ... తప్పుచేస్తున్నాననీ, పాపం కావిస్తున్నాననీ, దేవుడు శిక్షిస్తాడనీ, పాపం దాని ఫలం త్వరలోనే చూపిస్తుందనీ లేకుండా... ఒకళ్ల కౌగిట్లో ఒకళ్లు దివారాత్రాలు, సమయాసమయాలు తెలియకుండా రోజులు, వారాలు, నెలలు తిప్పేసేము. సుఖించేము. తృప్తిచెందేము.

ఆ క్రిస్టమసు సెలవుల్లో మాఅన్నయ్య ఒక్కసారి వచ్చి వారంరోజు లుండి వెళ్లిపోయేడు.

ఇంక కొద్దిరోజులకు వస్తాడనగానే, మావదిన నాదగ్గిరసా వస్తూ తన చేతులతో నా భుజాన్ని చుట్టివేస్తూ ఒకళ్ల శరీరం ఒకళ్లకు తాకుతూంటే, రహస్యంగా "నీకు కొడుకు పుడతాడు రాజా!" అని చెప్పింది.

ఒక్కసారిగా అప్పుడు నాకు దిక్కులు తెలిసేయి. నామైకం నాకు వదిలింది. నాకామం చప్పబడింది.

యవ్వనంలో ఉడికిపోతూ, కొద్దిరోజులే స్త్రీ సౌఖ్యం అనుభవించినవానికి తప్పు, పాపం అన్నవి ఆ క్షణంలోమాత్రమే బాధిస్తాయి; ఖేదపరుస్తాయి. తర్వాత లోనున్న 'కామం' అతని ఆ విచారాన్ని, బాధపడ్డాన్ని క్షణికంగానే చేసేసి అతనిని ఒళ్లు తెలియని మైకంలో కప్పేస్తుంది. కృషిచేసినందుకూ, చదివినందుకూ శిక్షగా అందులో ఉద్రిక్తుణ్ణి చేసి, ప్రోత్సాహిస్తూ వుంటుంది. దాని ఫలితంగా తర్వాతి రోజుల్లో నేనూ, మావదినా కలిసే ... భార్యాభర్తల్లాగే రహస్యాలు చెప్పుకుంటూ, పుస్తకాలు చదువుతూ, ఒకరి కొకరు బోధించుకుంటూ, నూతన ఊహల్లో ఊగులాడుతూ గడిపేము.

ఆ సమయంలో పురుషుడికి స్త్రీ అంటే ఏమిటో బోధపడ్డది.

తోడిచుట్టాలు—బంధువులుగాని, ఆప్తులుగాని వచ్చి తీసుకొనివెళ్లేవారు లేనందున మావదిన పురుడు పోసుకోడానికి ఇక్కడే వుండిపోయింది.

తొమ్మిదిమాసాలు నిండిపోయాయి. ఇక రెండు మూడురోజులకు పురుడు వస్తుందనగా నన్ను అడిగింది- పుట్టిన పిల్లాడికి ఏం పేరు పెడుదామని. కొంతసేపు ఇదీ అదీ అని తికమకలు పడ్డాం. ఆఖరుకు 'రామూ' అనే ముద్దుపేరే నిశ్చయించుకొన్నాము.

ఆనాడు రాత్రి సరిగా పదిగంటల పది నిముషాలకు రామూ మొదటిసారిగా ఈ ప్రపంచములో గాలి పీల్చేడు. తర్వాతి తన భావిజీవితంలో ఈ జీవనంకంటె మరణమే మేలని తెలిస్తే... అతను... కొంతమంది పిల్లల్లా నిర్జీవంగానే పుట్టించమని మూగగా, ఆ అంధత్వంలో విశ్వమయరూపునితో సంభావణ, సంతోషాలతో గడిపిన భగవంతుణ్ణి అడిగియుండునేమో! నామూలాన, తలెత్తుకోలేకుండా జీవితం వెళ్లబుచ్చుకోడానికి పాల్పడకుండా, కళ్లు తెరవకుండానే మొట్టమొదటిసారిగా అంత్యశ్వాస పీల్చేవాడేమో! నా పాపం ఆతన్నికూడా చుట్టబెట్టి పొట్ట పెట్టుకోకుండా వుండేదేమో!

మొదటి మూడురోజులూ నలతగానే వుంది మొదట. తర్వాత తర్వాత జ్వరం తగిలింది. రోజురోజుకూ అది ఎక్కువై పోయింది.

ఓరోజున రహస్యంగా పిల్చింది. "రాజూ! నేను బ్రతుకుతానో బ్రతకనో తెలియదు. చచ్చిపోతాననే అనుకో. రామూను...మనిద్దరికీ మధ్య కలిగినవానిని- నీ కొడుకును... నీవు ఇంకొకళ్ల కియ్యకుండా పెంచుతానని వాగ్దానం చెయ్యవూ? అల్లా పెంచి పెద్దవానినిగా చేస్తానని మాట ఇయ్యవూ?" అంది.

నిజంగా అప్పుడు నాకు కళ్లమ్మట నీళ్లు తిరిగిపోయేయి. ఆకన్నీళ్లతోనే ఆమెచేతిలో చెయ్యివేసి, ఆజన్మాంతమూ నా కొడుకుగానే పెంచుతానని మాట ఇచ్చేను. అది ఆమెఅంత్యకోరికగానే అయేటట్లు చేసేడు దేవుడు. సంతోషించింది.

తర్వాత ఆ నలత ఎక్కువైపోయింది. ఆశకూడా నిరాశ అయిపోయింది... పదోరోజున ఆమె చివరిసారిగా వాయువును తీసుకొని ప్రకృతిలో లీనమైపోయింది. తన ప్రాణం, తన రక్తం, తన చీము, తన అన్నది సర్వమూ కలిగిన రామూను నిస్సారంగా, నిర్దయగా వదలి వెళ్లిపోయింది. చచ్చిపోయింది... మృత్యువుకు ఎర అయిపోయింది. ఎంతదూరంగా అది మచ్చవదలి వెళ్లిపోతుందో... ఎంతనిర్దయగా అది విజృంభణ అయి కరాళనృత్యం చేస్తుందో...ఎంతమంది దాన్ని జయించలేక వెళ్లి ఎర అయిపోయేరో!

'పాపం'-'నాపాపం' ఇప్పటినుంచీ తన చర్య ప్రారంభించిందా? తన శిక్ష తాను ఇవ్వడానికి అది ఆ కుర్చీక్రింద కూర్చుని తెల్లవిగ్గులు కప్పుకొని తీర్పు చెప్పడానికి సిద్ధంగా తయారయిందా? చెప్పిందా? చెప్పుతోందా? "ఈనాడు నీవు చేసిన కృత్యానికి, మోసానికి, అన్యాయానికి, మీ అన్నయ్యకు చేసిన కృతఘ్నతకు అనుభవించు... దాని ఫలితంగా ఈ పసిగుడ్డును...నీ హృదయం, నీ అంతరాత్మ, నీ ఆత్మ,నీ శరీరంలో ఉండే ప్రతీ అంగం, ప్రతీనరం, ప్రతీకణం, ప్రతీ

జీవమూ నీ కొడుకు నీకొడుకు అని రేకెత్తిపోతూ, ఉడికిపోతూ, అపూర్వప్రేమతో నిండిపోతూ, అల్లాడిపోతూంటే "వాడు నీ కొడుకు కాదు. మీ అన్నయ్య కొడుకు" అని లోకంలో ఉండే ప్రతీమనిషీ, ప్రతీచుట్టమూ, ప్రతీ స్నేహితుడూ, ఆఖరుకు నీ తల్లీ, నీ అన్నా కూడా అల్లాగే తలుస్తూ, అల్లాగే పిలుస్తూ వుంటే, పెంచు, పెద్దవాణ్ణి చెయ్యి.

ఆనాడు నువ్వే గనక లోబడకుండా వుంటే, అరూ ఇంకా ఈ భూమిమీద నూకలు తింటూ, ఆశించుకొన్న, వేచియున్న సౌఖ్యాలన్నీ పొంది నీ అన్నయ్యతో సుఖించునేమో! ప్రతి స్త్రీకీ ఈ ప్రపంచములో మృత్యుగండంగా తలిచే మాతృత్వం అప్పుడే పొందకుండా ఉండి సుఖంగా ఉండేదేమో! దుర్మార్గుడవు... తుచ్ఛుడవు...కాముకుడవు ... అన్న లేడని... అరూ తాత్కాలికంగా కోర్కెకు లోబడితే ...నీవు నీచుడవై చెరిపేవు కాదూ! నీమూలాన్నే కాదూ అరూ చచ్చిపోయింది ... ప్రాణాన్ని తీసేసినవాడవు నీవే కాదూ! ఇల్లా కుళ్లిపోతూ నీహృదయం పాపాన్ని చేసినందుకు ఫలం అనుభవిస్తున్నానని గగ్గోలు పెడుతూంటే బ్రతుకు... పెంచు... పెద్దవాణ్ణి చెయ్యి"

ఆ మొదటి రోజుల్లో ఎవరో నిలవతీసి అడుగుతున్నట్లుగా అయిపోయేది. కుళ్లిపోయేవాడిని. ఏడ్చేవాడిని. విచారించేవాడిని. అశాంతిలో మునిగిపోయేవాడిని. కృశించిపోయేవాడిని.

కాని...

రామూకు నేనూ, నాకు రామూమాత్రం ఒకళ్లకు ఒకళ్లం అవకుండా ఉండలేక పోయేము. నాకు జీవితంలో ఆశ ఒక్కటి ఉన్నదన్నట్లుగా రామూ ఒక్కడే జీవితంలో మెరసేవాడు.

* * *

"పిల్లాణ్ణి మేము పెంచి పెద్దవాణ్ణి చేస్తాము. మా కివ్వండి" అంటూ మాటవరసకి అరూ పినతండ్రి వచ్చి అన్నాడు పన్నెండో రోజున. ఇవ్వడానికి మా అన్నయ్యకూడా సగం ఒప్పుకొన్నా మాఅమ్మ పట్టుదలమీద "నీకొడుకును వాళ్ల కిచ్చుకోవడం ఏమిటి—కొద్ది రోజుల్లో మళ్లీ పెళ్లి చేసుకొందు గాని... ఆపిల్లే పెంచుతుంది... మనవాళ్లు మనదగ్గ రుండాలి కాని..." అని అనేటప్పటికి మరి మాట్లాడలేకపోయేడు. ఎక్కడ అంటుకొంటుందో అని దూరదూరంగా నుంచుని అడిగిన ఆ పినతండ్రి గుండెలు ఈమాట వినడంతోటే, ఒక్కసారిగా తేలికపడ్డాయి. తర్వాత ఒకటి రెండు రోజు లుండి తిరిగి తన వూరు వెళ్లిపోయేడు ఆయన.

మా వీథికి చివరగానే వున్న ఓవర్సీరుగారి అమ్మాయిని ఇస్తామంటూ వాళ్లు పురోహితుడిద్వారా కబురంపించేరు. మా అమ్మ ఆ సంబంధం మంచిదేననీ, వాళ్ల సంప్రదాయం, కులం శ్రేష్ఠమైనదే అనీ, చేసుకోవలసిందనీ మా అన్నయ్యకు ఎంతో బోధించింది. చెప్పింది. ఆఖరుకు బ్రతిమాలింది కూడాను.

ఎన్ని చెప్పినా, ఎంతబ్రతిమాలినా మా అన్నయ్యమాత్రం మళ్లీ పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకోలేదు.

అల్లాంటి సమయంలో...దోషినని లోపలలోపల కుళ్లు పొడుస్తుండడంవల్ల నేనేమీ చెప్పలేకపోయేను.

ఏమి చెప్పినా వినకపోవడంమూలాన మాఅమ్మ నన్ను చాటుగా పిలిచి "ఒరే రాజూ! సీతారామయ్యగారితో చెప్పి చెప్పించరా ఓసారి. ఆయనమాట వింటాడు" అంది. 'అల్లాగే' అని, అవ్వాళ సాయింత్రం సీతారామయ్యగారింటికి వెళ్లేను.

సీతారామయ్యగారు మా కాలేజీలో లెక్చరరు. మా అన్నయ్య చదువుతూవున్న రోజుల్లో వీడు క్లాసులోకల్లా ఫస్టుగా ఉంటాడనీ, తెలివితేటలుగలవాడనీ, తోటినియోగనీ ఎంతో యిష్టంగా ప్రేమతో చూచేవాడు. అప్పటినుంచీ మా అన్నయ్య ఆయన్ను ప్రతీవిషయంలోనూ "ఈపని చెయ్యనా వద్దా" అని అడుగుతూ ఉండేవాడు. ఆయన ఏమి చెపితే అది చేసేవాడు. అంచేత ఆయన చెపితే ఒకవేళ వింటాడేమో అని ఆయనతో చెప్పేను.

ఆయన ఓరోజు వచ్చి చెప్పేడు. ముసలితల్లిని గురించీ, పెళ్లి చేసుకోకపోతే కలిగే సాధకబాధకాలూ, లోకం...ఎన్నో చెప్పేడు. ఆఖరున గట్టిగా చేసుకు తీరాలన్నాడు.

"మేష్టారూ! వీరు అల్లా చెపుతారు పెద్దలు కనుక. కాని నాకు మాత్రం చేసుకోవాలని లేదు... పోనీ, ఇదివరకు చేసుకొన్నాను-ఆ చేసుకొన్న ఇల్లాల్ని ఏం సుఖం పెట్టేను? నేనో వూళ్లో, అదో వూళ్లో...ఇద్దరమూ ఇల్లా విడిపోయివుండి, భార్యాభర్తల మనిపించుకొన్నాము. వుద్యోగమా? చూస్తే పట్టుమని పది రూపాయిలేనా వుండదు. ఇద్దరమూ కలిసివుండటానికేనా చాలదు. అల్లాంటప్పుడు అంత తొందరేమి వచ్చిందండి? ఇద్దరికీ చాలినంత జీతం వచ్చిం తర్వాత చేసుకోవచ్చులెండి...అరూ...ఎంత..." అని చెప్పేడు కన్నీరు కారుస్తూ.

ఏమీ చెప్పలేకపోయేరు సీతారామయ్యగారు కూడా. ఆఖరుకు "సరే అయితే, నువ్వు చేసుకోవోయి ఆవోవర్సీరుగారి అమ్మాయిని రాజూ!" అన్నాడు చటుక్కున.

ఒక్కసారిగా నేను గుండె లాగిపోయేటంతగా దిగనారిపోయేను.

"అవును. అది బాగానే వుంటుందండీ" అంది మా అమ్మ.

"ఆయన ఎవరికేనాసరే ఈడు తగుతుందని నాతో చెప్పేడు...అయితే రాజూ! ఆ అమ్మాయిని ఎప్పుడైనా చూచేవా?"—సీతారామయ్యగారన్నారు.

"అవునురా! అమ్మకూడా ముసలిదై పోతోంది. కూడా తోడుకు ఆసరా ఎవరూ లేరు. ఏదో నువ్వు యింటిదగ్గరే వుంటావు కనుక, చదువుకూడా ఈ మార్చితో అయిపోతుంది...తర్వాత ఎల్లాగో ఈవూళ్లో ఉద్యోగంకోసం ప్రయత్నిద్దాము...చేసుకో" అన్నాడు అన్నయ్య.

పెళ్లి!...దానికి నేను అర్హుణ్ణా? దానికి నేను తగుదునా? ... ఎదురుగుండా ఉయ్యాల్లో రామూ! మొదట పుట్టగానే "అన్నయ్యా! నమస్కారములు. వదినకు ఇన్నో తారీఖున రాత్రి పది గంటల పదినిముషాలకు మగపిల్లాడు కలిగేడు. తల్లీ పిల్లాడూ కులాసాగానే వున్నారు" అని రాసేను. కాని లోపల అంతరాత్మ 'నాకొడుకు' అని రాయక 'నీకొడుకు' అని ఎల్లా రాయగలిగేవు అని పీకింది... పెళ్లి కావాలా? రామూ చాలడూ? ముందు నీకే గనక పిల్లలు కలిగితే అప్పుడు రామూగతేమవుతుంది? ఆతన్ని నీపోషణలో నీభార్యవస్తే వుండనివ్వగలదా? ఆతన్ని ప్రేమించనిస్తుందా?...ఎన్నో ఆలోచనలు వచ్చేయి.

ఇదివర కెప్పుడూ నేను మా అన్నయ్యన్నా, సీతారామయ్యగారన్నా గౌరవముతోనూ, భయంతోనే మెసలేను. వారి మాట కెప్పుడూ ఎదురు చెప్పలేదు. కాని —

"ఆ! ఇప్పటినుంచీ తొందరేమి వచ్చిందండీ... పరీక్షలవనివ్వండి..." అన్నాను.

"అల్లా అనడం అందరికీ సహజమే" అన్నారు సీతారామయ్యగారు.

"ఏదో నాయనా! ముసలిదాన్ని అయ్యేను. నాకొడుకుకు నాల్గు కాయలు కాచి వారు సుఖంగా వున్నారంటే ముసిలిప్రాణం సుఖిస్తుంది. ఒప్పుకో నాయనా" అంది అమ్మ.

"ఔనురా రాజూ! అమ్మకూ తోడుగా వుంటుంది. ఏదో చంటిపిల్లాడు—రామూ—" చెప్పలేకపోయేడు. కంఠంలో అడ్డుపడ్డట్టుగా మాట్లాడేడు మా అన్నయ్య.

"అవును. రామూకు ఇప్పుడెవరు సంరక్షణ చేస్తారు? అమ్మ ముసలి దయిందికదా.. ఏదో పెళ్లి చేసుకొంటే ఆవిడ చూస్తుంది. మగాడవు నువ్వేం చెయ్యగలవు" అని పూర్తిచేసేరు సీతారామయ్యగారు మాఅన్నయ్యమాటలను.

ఓవిధంగా, రామూను చూస్తుంటే, అప్పుడు దుఃఖమే వచ్చింది.

"సరే లెండి" అన్నాను ఎల్లాగో.

"శుభస్య శీఘ్రం" అంటూ, "నేను వెళ్లి ఆయనతో తక్కిన విషయాలు మాట్లాడుతాను." అని సెలవుతీసుకొన్నాడు ఆయన.

తర్వాత కొద్దిరోజులలోనే లాంఛనంగా ఆ అమ్మాయిని చూసేను ... తాంబూలాలు పుచ్చుకొన్నారు. ముహూర్తంకూడా నిశ్చయంచేసేరు.

కట్నం వెయ్యిన్నూటపదహార్లు, వెండిచెంబూ, వెండిపళ్లెం, పట్టుపంచెలచాపూ! మూడురోజులపెళ్లి. ఆవూళ్లోనే.—

ఆశ్రావణమాసంలో —

హృదయంలో రండోళ్లు మోగుతూవుంటే, లయ వేస్తూ బాజాభజంత్రీలతో నాకూ, లక్ష్మికీ పెళ్లి అయిపోయింది.

*  *  *

మా అన్నయ్య పెట్టిన సెలవులు రెండునెలలూ అయిపోవడంతోటే వెళ్లిపోవడానికి సిద్ధమై పోయేడు. వెళుతూవెళుతూ "రాజూ, నాజీవితంలో అరూ ప్రవేశించి, ఒక్కగా నొక్క ఆశగా — అరూను మరిచిపోకుండా రామూను వదలి వెళ్లి పోయింది—నా అంధ జీవితంలో ఆ చిన్న జ్యోతిని చూచి ఆనందించమని. ఆరామూను నీ చేతుల్లో పెడుతున్నాను. ఎల్లా పోషిస్తావో, ఎల్లా పెంచుతావో! అంతా నీకే వదిలేస్తున్నాను. నాకోసం నువ్వు ఈపాటి..." కన్నీళ్లు తుడుచుకొన్నాడు.

నిజంగా ఆసమయంలో అరూను మా అన్నయ్య ఎంతగా ప్రేమిస్తున్నాడో! ఆమెమరణానికి ఎంతగా విలపిస్తున్నాడో! అరూ!... ఆతని హృదయాన్ని ఎంతగా చీల్చేస్తోందో! వ్రక్కలుగా చేసేస్తోందో... నాకూ కళ్లమ్మట నీళ్లు తిరిగిపోయేయి.

"అల్లాగే" అన్నాను – ఆ చెయ్యితో ఊరుకో పెడుతూ. ఆచెయ్యి–ఆచెయ్యితోనే అరూకుకూడా వాగ్దానం చేసేను ఆమెమరణశయ్యమీద.

వెళ్లిపోయేడు అన్నయ్య. కుంగిపోయిన ఆ హృదయాన్ని రైలుకమ్మలమీద చక్రాలచప్పుడుతో, దూరదూరంగా చెట్లు గిరగిరా తిరుగుతూవుంటే చూచి అనునయం చేసుకో అని సాగనంపేను స్టేషను వరకూ.

ఆఖరుసారి బండిలో కాలుపెడుతూ "రాజూ! రామూభారమంతా నీపై వదలుతున్నాను." అని మళ్లీ రుద్ధంగానే అన్నాడు.

తండ్రి ప్రేమ అల్లా అనిపిస్తుంది కాబోలు! అంత ఎక్కువగా వాపోవనిస్తుంది కాబోలు! అరూయెడల నిశ్చల, నిర్మలప్రేమ అల్లా ఆరాటన చెందిస్తుంది కాబోలు!...రామూ! ఆతన్ని ఇంకా–అతనే కాదు, దగ్గరగా నున్న లోకం అంతా ఆతని కొడుకే అనుకొంటోంది. ఊహించుకొంటోంది. అందువల్లే అంత ఆరాటన, ప్రేమ, వాత్సల్యం, దుఃఖం కల్గించి క్షోభ పెడుతుంది కాబోలు. ఆ జీవికొరకు! వాడి భావి కొరకు! వాడి ఎత్తుబడి కొరకు! నాహృదయం అప్పుడు నిజంగా, సత్యంగా వానికి రామూను తన కొడుకని పిలవడానికి హక్కు లేకపోయినా, మూడుముళ్లు కట్టేనన్న అధికారంతో, దానివల్ల పొందిన గౌరవం హక్కులతో అల్లా చెప్పుతుంటే ... మండిపోయేది. నాలో నాకే 'నీకొడుకు' అని ప్రతీకణం ఒకటితో ఒకటి దెబ్బలాడుకొనేవి. అరూ నాభార్య కాకపోయినంత మాత్రాన రామూ నా కొడుకు కాకూడదా? రామూలో నారక్తం, నాచీము ప్రవహించటం లేదా? రామూ రూపంలో, మూర్తిలో, ఆకారంలో, పొందికలో నారూపం ప్రతిబింబించటం లేదా? అరూ మరణశయ్యమీద 'రామూ నీకొడు' కని చెప్పలేదా? ...ఇల్లా నిలతీసి 'రామూ నావా' డని అంటున్నవాడినల్లా అడగమని, నాలో పాతుకుపోయిన వాత్సల్యం, ప్రేమ, నాకొడుకన్న భావం నన్ను ప్రోత్సహించేది. ముందుకు త్రోసేది. కాని—

రామూ భావిజీవితం! ఆతను పెద్దవాడై, జ్ఞానం వచ్చినతర్వాత "మీఅమ్మ మరదితో వ్యభిచారం చేసింది. రంకుతనం చేసింది. మీఅయ్య ఇంకోవూళ్లో ఉద్యోగానికి వెళ్లినప్పుడు, ఆసంవత్సరన్నరలోనూ నువ్వు పుట్టేవు. నువ్వుకన్లేవు. రాజు నీకు అసలుతండ్రి. ఆఉద్యోగంచేస్తున్న ఆయన సంఘానికి నీకు తండ్రి. ఇద్దరు తండ్రుల ముద్దుబిడ్డడవోయి." అని వెర్రిగా ఈ లోకం కూస్తే, ఎదురుతిరిగితే...అప్పుడు రామూను – ఆతని జీవితాన్ని నీవు ఎంతగా ప్రేమిస్తున్నావో, అంతగా దుఃఖపెట్టవా? బ్రతికుండగానే సంఘం అనే శూలాలతో గ్రుచ్చి, నీకళ్లయెదుటే ఆ గాయాల్లోంచి రక్తం కారుతుంటే చూస్తూవుంటావా? అది ఓర్చుకోగలవా?

రామూ!... నారామూకు అన్యాయం చెయ్యలేను. ఆతన్ని ఈసంఘానికి, లోకానికి, జాతికి, నీతికి

ఒప్పచెప్పలేను ... అప్పగించలేను ... రామూ నా కొడుకు అని నాహృదయంలో తృప్తిపడతాను. నేను తండ్రినై, ఇంకొకడు తండ్రి అని నానోటితోనే చెప్పి, హృదయం కృశించి కుళ్లిపోతూంటే ... వ్రక్కలై పోతూవుంటే పెంచుతాను ... చదివిస్తాను ... పెద్ద వాణ్ణి చేస్తాను.

ఒక్కొక్కసారి రామూ అవుయ్యాల్లో పండుకొని ఆడుకొంటూ ఉంటే చూచేవాడిని... రామూలో నాకళలన్నీ ప్రతిబింబించేవి. ఆముక్కు నాముక్కులాగే మొదటిలో గొయ్యి, ఆనోరుకూడా చిన్నదిగా నానోరునే పోలి వుండడం, ఆచెవులుకూడా పైభాగంలో అందంగా నావాటిమల్లేనే త్రిప్పివుండడం ... ఇవన్నీ చూచేటప్పటికి నాలో నాకే ఒక భయం ఆవరించేది ఆసమయాల్లో. నేను నాహృదయంలోని దావాగ్నులు, ప్రళయాలు, జంఝూటాలూ అణగద్రొక్కకుంటూ, రాముకొరకు వాటి విజృంభణలు అడచుకొంటున్నా లోకం సత్యం కనుక్కోగలుగుతుందా? పోలిక కనుపెట్టి నాకొడుకేమో అని నిజం బయట పెట్టుతుందా? అల్లాటి కూతలు కూస్తుంటే నేను ఏమీ చెయ్యలేక ఊరకనే వుంటే, అతని భావిజీవితాన్నంతా దగ్ధంచేసి, పైశాచీగీతి చదువుతుందా?... ఇల్లా భయపడిపోయేవాడిని. ఒక్కసారిగా ఆతడు జ్ఞానవంతు డవకుండానే నేను పరమ పదిస్తే బాగుంటుందేమో అనుకొనేవాణ్ణి. అల్లా కోరుకునేవాణ్ణి.

ఆ ఆసమయాల్లో ఆ ఆలోచనలన్నీ నన్ను కుమిలించేస్తూవుంటే ఉడికిపోయి శాంతికొరకు ఏడ్చేవాడిని తెలియకుండానే. భగవంతు డున్నాడని వాడిని ప్రార్థించేవాడిని అప్పుడే ఆచిన్నతనంలో నాస్తికత్వం వదలిపోయి భగవంతుడు అంటే, ఓదయ, ఓజాలి, ఓకరుణ, ఓశాంతి... అదే అనుకొనేవాడిని. దానికొరకు వాచిపోయేవాడిని. క్రమక్రమంగా ...

* * *

ఆవేశంగుల్లో నాపరీక్ష లయిపోయేయి. హృదయంలో కోరుకున్న శాంతి లేకపోవడంతోటి చదవడంమీద ఆసక్తి తగ్గిపోయింది. దానియెడల ఓ ఏహ్యభావం కూడా కలిగింది. "అదే మాఅన్నయ్యను, వదినను విడతీసి వారిరువురి మధ్యా నన్ను తీసుకొచ్చింది. ఇప్పుడు కుళ్లించిమ్రగ్గబెడుతోంది" అని కోపంకూడావచ్చేది. కాని ఏదో ఇన్నాళ్లు చదివేము; ఇప్పుడు ముచికి కొడుకుకు వచ్చింతరువాత మానెయ్యడం ఏమిటని అల్లానే ఆకొద్దిరోజులూ కష్టపడి, ఓమాదిరిగా రాసేనని అనుకొనేటట్లు చేసేను.

మామామగారు వచ్చి ఆసెలవుల్లో "లాంఛనం కాస్త తీర్చుకొంటే బాగా వుంటుంది. ముహూర్తాలు కూడా వున్నాయి" అని చూచాయగా చెప్పేరు.

మాఅమ్మ ఆసరా లేకుండా కష్టపడిపోతోందని, ముహూర్తం నిర్ణయంచేసి, ఆకాస్త నిషేధం తీర్చుకొని లక్ష్మిని మాయింటికి తీసుకొచ్చేసేను.

లక్ష్మి అంత అందమైన పిల్ల అని చెప్పలేక పోయినా, సంసారపక్షంగా ఉండే చక్కదనం లేక పోలేదు. ఆమధ్యగా చెవులమీంచి తీసి వెనకగా వైచిన శిఖ, గుండ్రటి ముఖం, చిన్నదిగా ఉన్నా చక్కదనం చేకూర్చే ముక్కు, ఆ పొట్టిగా—అంత లావు, అంత సన్నము కాకుండా చిన్న గుమ్మటంలా ఉన్న దేహం! తోలు అంత నలుపు కాదుకాని చామన చాయలోకి వస్తుంది. ఇవన్నీ ఎల్లా వున్నా ఆకళ్లలో ఆతెల్లగుడ్డులో స్వేచ్ఛగా పచారుచేస్తున్న నల్లటి పాప, చక్కగా కుదించి పెట్టినట్టుగా ఉన్న కనుబొమ్మలూ మాత్రం లక్ష్మిలో లక్ష్మి ఓడుతూవున్నాయని చెప్పవచ్చు.

లక్ష్మి రావడంతోటే అరూబదులు లక్ష్మి ఇప్పుడు ఈ ఇంట్లో స్థానం వహిస్తోందికదా అని ఓమాదిరిగా నేను మొదట తృప్తిపడ్డా, అరూనుమాత్రం మరచిపోలేకపోయేవాడిని. ఆమె మెసలిన తావులు, పడుకున్న గది, నాకు ప్రథమంగా యవ్వనోద్రేకం కలిగించిన ఆస్థలం, ఇంకా ఎన్నోసార్లు కలిసి ఒకటిగా తిరిగిన స్థలాలు — ఇవన్నిటిలో ఆ చచ్చిపోయిన అరూయే లక్ష్మిక్రింద వచ్చిందని ఆ ఆస్థలాల్లో, ఆఆమచ్చపడ్డ గాయాల్లో, ఆఆసుఖం వొలికిన సన్నివేశాల్లో అనుకొని, ఆమెతో మసలలేకపోయేను. ఉండలేకపోయేను. అనుభవించలేకపోయేను. దాం

తోనే పడమటివైపు పడకగదిలో వుండలేక, ఏగదిలో అయితే నాపాపం ప్రారంభింపబడిందో అది మార్చి దక్షిణపువైపుగదిలోకి వచ్చేసేను. మార్చిన తర్వాత ఆఆగదులవైపు వెళ్లడం అంటేనే ఏదో జీవితంలో అప్పుడే నును నునుపుగా పెచ్చుకట్టుతున్న గాయాన్ని రేపినట్లయ్యేది.

ఆ ప్రథమదినాల్లో ప్రతీ కొత్తకోడలూ అల్లా చేస్తుందో, లేకపోతే మంచిది మాకోడలని అనిపించుకోడానికి చేసిందో కాని అన్నిపనులూ, అన్నిచక్కగింపులూ, అన్ని ఆదరణలూ, పోషణలూ, లాలింపులూ తన భుజాలమీదికి తీసుకొంది లక్ష్మి. దాంతో ఓవిధంగా నారామూకు సంరక్షణ జరుగుతుందికదా అనీ, మా అమ్మకు శ్రమ తగ్గిందికదా అనీ తృప్తిచెందేవాడిని. ఊరట చెందేవాడిని.

అవ్వాళ...

మధ్యాహ్నం పనులన్నీ చక్కపెట్టి, రామూను చంకనపెట్టుకొని నాగదిలోకి వచ్చింది లక్ష్మి. మంచంమీద ఓపక్కకు జరిగేను. ఖాళీఅయిన స్థలంలో రామూను కూర్చోపెడుతూ తానూ కూర్చుంది.

రోజూ అనేకగంటలు రామూను విడవలేక హృదయం తపించిపోవడంవల్ల దగ్గరగానే వుంచుకొంటూ, లాలిస్తూ, ఆడిస్తూ, పాడిస్తూ వున్నా, అది లక్ష్మి చూచినా, "ఏమండీ ఈమధ్య రామూను అసలు చూడటంలేదు. వాడిని ఓసారైనా ఆడించటం లేదు. చూచేందుకైనా రావడంలేదు. పను లెక్కువైపోయేయి కాబోలు" అంది.

ఒక్కసారిగా లక్ష్మికళ్లల్లోకి చూచేను—సమాధానం ఏమీ చెప్పకుండా.

"చూచేరా! రామూ ఎంత అందంగా, ముద్దుగా తయారైపోతున్నాడో!"

"వాళ్లమ్మ ఎంతో అందంగా ఉండేది. తల్లిపోలికే" అన్నాను తెలియకుండా. తర్వాత మాట జారి వచ్చినందుకు లోపల్లోపల నాలిక కరుచుకొన్నా.

"వాళ్లమ్మపోలిక ఎల్లా వున్నా, ఈముక్కు, ఈచెవులు, ఈనోరుమాత్రం మీపోలికే! రామూకు పినతండ్రిపోలిక వచ్చిందన్నమాట." రామూకేసి చూస్తూనే అంది.

ఒక్కసారిగా బ్రతికున్న జంతువును పరీక్ష చెయ్యడానికి కోసేటప్పుడు అది పడే బాధ పడ్డాను.

"ఏమంటారు?"

చూచేను. ఆ అమాయకత్వంలో తెలియకుండా అనేస్తోందా? సత్యం చెప్పేస్తోందా? భగవంతుడు నిజం అంతా సూక్ష్మంగా వచ్చినవాళ్లకు బోధించి, అది అనిపించి, నాపాపానికి ఫలితంగా, కుంగిపోతున్న హృదయాన్ని మరింత ముడుచుకొనేటట్లు చేయిస్తున్నాడా?

'ఊ' అనకతప్పిందికాదు. అదైనా రాకరాక, నిర్దోషత్వం ప్రకటింపకుండా రాలేకపోయింది.

* * *

తెలియకుండానే కాలగమనచక్రం ఒక్కొక్క వత్సరమే దొర్లిస్తూ మాజీవితాల్లో పదిహేను సంవత్సరాలు వెనకకు నెట్టేసింది; ఆ జరిగిపోయిన వత్సరాల్లోని మాధుర్యాలూ, ఆటపాటలూ మళ్లీ తిరిగి రాకుండా.

ఈ పదిహేను వర్షాల్లోనూ నాలోనూ, నా కుటుంబంలోనూ అనేకమార్పు లొచ్చేయి. ఇప్పుడు నేను ముగ్గురు బిడ్డల తండ్రినైపోయేను. ఇద్దరు మగవాళ్లు; ఓ ఆడపిల్ల.

రామూ స్కూలుఫైనలు ప్యాసు అయిపోయి కాలేజీలకు వెళ్లడానికి సిద్ధమైపోయేడు. నేనూ, మొట్టమొదట్లో ఇచ్చిన రెండువందల రూపాయల లంచంతోటి వచ్చిన ఉద్యోగంలో పైమెట్టు ఎక్కేసి అరవై రూపాయల జీతగాడిని అయిపోయేను.

అందరూ సుఖంగా వున్నారు. దేవుడు నా మొర విని నన్ను రక్షించేడని అనుకొనేటప్పుడల్లా, అల్లా సంతోషించేటప్పటికల్లా ఏదో హృదయాన్ని సమ్మెటలతో కొట్టినట్లు బాధించేది. రోజూ అలవాటు ప్రకారం రామూ మధ్యాహ్నం నాకు టిఫిను తెస్తే ఎవరో ఒకరు "ఆ అబ్బాయి మీఅబ్బాయా అండీ?" అనేవారు.

"కాదు, మాఅన్నయ్యగారి కొడుకు"

"అల్లాగా? అచ్చు మీపోలికేనండి!"

ఇల్లాంటి సన్నివేశాలు ఏర్పడేవి. నిజంగా నా సౌఖ్యాన్ని ఆశించుకోవడం, అందులో క్షణికంగా తృప్తిచెందడం! పేకముక్కలతో కట్టిన అంతస్తు మేడల్లా అయిపోయేది అది ఇల్లాంటి సన్నివేశాల్తో కూలిపోతూ. అప్పుడప్పుడు లోకం చాటుగుండా, కొద్ది కొద్దిగా రహస్యపు గొంతులతో గొణుగుకొంటూ, వెనకాల చర్చించు కొంటున్న ఈ విషయాలతో.

రామూ ఇంకా ప్రపంచకం అంటే ఎక్కువగా అర్థంచేసుకోలేనందున అతనూ అప్పుడప్పుడువిన్నా... క్షణికంగా ఆలోచించడం, తప్పు అనుకోవడం, తనం తట తాను ఊరుకోవడం... ఇది అప్పుడప్పుడు ఆ మొఖంమీద నేను పుస్తకం చదివినట్లుగా చదవగలిగే వాడిని... ఆ సమయాల్లో చాటుగుండా కన్నీరు ఒత్తుకొనేవాడిని ... హృదయంలో రామూ భావిని గురించి వెర్రిగా పొరపడుతూ, దానిమీద సౌధాలు నిర్మించుకొంటూ.

రామూ 'నాన్న'— మాఅన్నయ్య —ఎన్నో సార్లు రామూను పంపమని అడగడం, నేను నిరాకరించడం, అప్పుడప్పుడు రామూకే అన్నిట్లోనూ నా పిల్లల కంటె ప్రాముఖ్యత, ప్రాధాన్యం, ప్రేమ, ఆదరణ కన్పరచడం, తనకొడుకుల్లో కాని, కూతుళ్లలోకాని ఒక్కళ్లకైనా అతని చిన్నతనంలో జరిగిన ముద్దు ముచ్చటలు చెల్లించక పోవడం...! "ఎన్నాళ్లు మనయింట్లో పడి తింటాడు...ఎన్నాళ్లు వీడికి చాకిరీ చేసిపెట్టగలరు? ఇంక బ్రతికినన్నాళ్లూ ఇల్లా వీడు పట్టుకొని వదలడా?" ఇల్లాంటి భావాలు,కార్యాలు, ఆలోచనలూ పెట్టుకొని రోజురోజుకూ లక్ష్మి మొదటిలో ఉన్న జాలి, ఆదరణ, ప్రేమ, అభిమానం తోలేసుకుంటూ, ఈర్ష్య, చూపోపమి, కఠినత్వం ఆహ్వానించుకొంది. అలవర్చుకొంది. అల్లా అలవర్చుకోవడం, ఆహ్వానించుకోవడంతోటే 'తన' అన్న గర్వం హెచ్చి 'రామూకు ఇక్కడ స్థలంలేదు... వెళ్లిపోవాలి, వెళ్లగొట్టాలి' అన్న కాంక్ష ఎక్కువైంది. దానిమూలాన కలకల్లాడే ఇల్లంతా గంభీరంగా, భీకరంగా, ఓ పెద్దపులుల గృహం చేసేసింది.

ఇల్లా అయిపోడానికి, ఇల్లా లక్ష్మికి దూరమై పోడానికి, ఆమె కోపానికి, ఈర్ష్యకు, చూపోపమికి గురి అవడానికి నేనే కారణ మనుకొంటాను. ప్రతీ యువకుడూ ప్రథమంగా తనకు స్వర్గం చూపించిన స్త్రీని మరచిపోలేడు. ఆమెను ప్రేమించిన హృదయంతో, అంత ఎక్కువగా ఆఖరుకు భార్యనైనా ప్రేమించలేడు. నేనూ అల్లాగే అయిపోయినాను. దానిమూలాన నాపిల్లలను రామూకంటె ఎక్కువగాను, లక్ష్మిని అరూకంటె ఎక్కువగానూ ప్రేమించలేక పోయేను. నా హృదయం అంతా అరూ, రామూలు ఆక్రమించుకోవడంవల్ల లక్ష్మిని, పిల్లలను లోకంకోసం—నాలో అప్పుడప్పుడు కలిగే కోర్కెకోసం, దాని తృప్తికోసం కంటె నిర్జీవంగా చేసేసి వాళ్లను సరిగా చూడలేకపొయ్యేను. ఇల్లా నా దాంపత్య జీవితంలోకూడా నా పాపం లక్ష్మిని, పిల్లల్ని చుట్టబెట్టి ఎడబాటు కల్గించేసింది కదా! అది నాకు తెలియకుండా ఉండకుండా నాకు తెలియచేసి, 'తాను చేస్తున్నాను, తాను అశాంతి కల్పిస్తున్నాను' అన్నట్లుగా విజృంభణ చెందడం హృదయంమీద సమ్మెట్లతో కొట్టినట్టుగా అయ్యేది. ఏం జరుగుతుందో, ఏమి ప్రళయాలు బయలుదేరుతాయో అని ఏరోజు కారోజు భయం గండంక్రింద అయిపోయింది. ఇల్లాంటి ఆవేదన ఫలితంగా అప్పుడే నాకు ముప్పైఎనిమిదేళ్లకే తలంతా నెరిసిపోయింది. శరీరంకూడా జిగీబిగీ వదలిపోయింది.

ఆరోజు...మామూలుగానే ఆఫీసుకు వెళ్లేను... నాముగ్గుబుట్ట హృదయంతో. అవ్వాళ రామూ ఆఫీసుకు వస్తే ఇదివరకు జరిగే సంఘటనలాంటిదే ఒకటి జరిగింది. దాంతో రామూహృదయం చివుక్కుమని ఎక్కువగా క్షోభ చెందినట్టు కన్పించింది. బ్రతికుండగానే మనిషిని కమ్మెచ్చులో పెట్టి నులిపినట్లుగా ఆకళ్లలో ఒక బాధ కాన్పించింది. నిజంగా అవ్వాళ నేను లోపల్లోపల కుళ్లిపోయి యేడ్చేను. పని సరిగ్గా చెయ్యలేక పెందరాళే ఇంటికి వచ్చేనేను హృదయ భారంతో.

గుమ్మంలో అడుగు పెట్టేను. సావిడిలోనించి మెట్లు ఎక్కబోయేసరికి పైనుంచి క్రమంగా "వెళ్లి

పో...నీకు ఈయింట్లో హక్కుముంది? నీవు అసలు ఎవరికి పుట్టేవో? మీ బాబు యింట్లో లేనప్పుడు, దూర దేశంలో ఉండగా నువ్వు కన్లేవుట. మీ అమ్మ ఏకుంతీదేవో అయి వుండాలి. లేకపోతే ఒక అమ్మ, అబ్బకు పుట్టినవాడవు... లేక మా ఆయనకే పుట్టేవేమో! అందుకనే ఆయన నిన్ను వదల్లేక చస్తున్నాడు..." వినపడ్డాయి. ప్రపంచకం అంతా తిరిగి పోతున్నట్లుగా అయింది. ప్రళయం బయలుదేరుతోందా? వరద వస్తోందా?

నేను పాలుపోసి, నాపంచ పెంచిన హృదయాన్ని, అది త్రాచుపామై ఇప్పుడు కరవడానికి గరళం కక్కుతోందా? అది ఇప్పుడు మృత్యు నృత్యం చేస్తోందా? నా పంచలో విషపు పుచ్చెకు– రెండు తలలపాముకు పాలుపోసేనా? అది ఇప్పుడు తిరగబడి నన్నే కరవడానికి పడగ విప్పిందా?

చేతుల్లోనూ, కాళ్లల్లోనూ బలం తగ్గిపోయింది. నేను కొద్దిక్షణాలే బ్రతుకుతానా? ఈశరీరం ఇల్లా విమలిప్తమై ఇక్కడే అంత్యశ్వాస తీసుకొంటుందా?

అల్లాగే ఒక్కొక్క మెట్టే ఎక్కేను. ఆహృదయం...ఎంతగా...

నన్ను చూచింది. "అరుగో వచ్చేరు! ఇద్దరూ కలిసి ఒకళ్లను చూచి ఒకళ్లు ఏడవండి" అని చటుక్కున ఆఖరిపిల్లవాణ్ణి తీసుకొని వెళ్లిపోయింది. లక్ష్మి... కాదు మృత్యుదేవత...పిశాచి...నరరూపరాక్షసి... నాగుపాము...

"రామూ!" దగ్గరగా వెళ్లి కౌగలించుకొన్నాను.

ఆహృదయం ఎంతగా వక్కలైందో! ఎంతగా చీలిపోయిందో! ఎంతగా కుళ్లిపోయిందో అందులో తెలిసిపోయింది.

"బాబాయి!" అంటూ నాకోటు తడిపేసేడు.

ఆగదికంతా మేమిద్దరమే అయిపోయేము. తండ్రీకొడుకులం... రామూ నేనూను. ఎక్కువగా క్షోభ కల్గినా, సంతాపం కల్గినా, ఆసమయాల్లో హృదయం తేలికపడ్డానికి భగవంతుడు కన్నీళ్లు పెట్టేడు. దాంతో ఊరడించుకోడానికి మార్గంగా చూపించేడు.

కొంతసేపటివరకూ ఎవరమూ మాట్లాడుకోలేక పోయేము. ఆఖరున—

"బాబాయి!" అందులో వెనుకటి ప్రేమ,అనురాగం, గౌరవం, మృదుత్వం చూపించకుండా ఉండలేకపోయేడు. దానికి నేను నిజంగా తగకపోయినా. ఇప్పుడూనూ...

"ఏం?" అన్నట్లుగా ఒక్కసారి చూచేను అతని ముఖంకేసి.

"బాబాయి! నేను ఒకటి అడుగుతాను చెపుతావా?"

"ఊ"

"బాబాయి! నేను...ఉ...నేను ఎవరికి పుట్టేను బాబాయి?" ఆత్రుతలో జీర కన్పించింది.

మరణం అన్నది ఎవళ్లది వాళ్ల చేతుల్లో ఉంటే, ఆక్షణంలో ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే అరూను కలుసుకొందా మనుకొన్నాను.

"బాబాయి! నిజంగా చెప్పు. నేను నాన్న వూళ్లో లేనప్పుడు పుట్టేనటగా! అందరూ నేను నీ పోలికగానే ఉండటంబట్టి నీకే పుట్టేనేమో అంటారు. పిన్నికూడా అల్లాగే అంది. బాబాయి! నేను నీకు పుట్టేనా? నీవు నాకు తండ్రివా? మా అమ్మ నీతో వ్యభిచారం చేసిందా? నిజం చెప్పు బాబాయి! నేను ఏమీ అనుకోను బాబాయి! నిన్నేమీ అనను బాబాయి!...ఒక్కొక్కసారి నావెనకాల, నాఎదురుగుండా నన్ను వెక్కిరిస్తుంటే నాకు నిన్ను అడగాలని...ఏమేమో అనుకొనేవాడిని...ఈరోజున అడుగుతున్నాను. ఈరోజున ప్రార్థిస్తున్నాను. నేను అప్పుడప్పుడు నీవే తండ్రివేమో అనికూడ ఊహించుకొనేవాడిని. అల్లాగే అనుకొనేవాడిని. నన్నెంతో గారాబంగా, ప్రేమతో పెంచేవు. ఈ రోజున కాళ్లు పట్టుకొని బ్రతిమాలుతాను. జరిగిన దేమో చెప్పు. మా అమ్మమీదగా ఒట్టు పెడుతున్నాను. ఆమెను చూచైనా చెప్పు..." కాళ్లు పట్టుకొన్నాడు.

ఏ కొడుకూ ఏ తండ్రినీ "నీవు వ్యభిచారం చేసేవా? అందువల్ల వాడు కలిగేడా? దాన్ని చెడిస్తే నేను పుట్టేనా?" ఇల్లాంటి ప్రశ్నలు వేయడు. వేసినా

ఆ తండ్రి సమాధాన మివ్వడు. కాని నాఅంతరాత్మకు ఇక్కడ నేను తండ్రినే. అతను నాకొడుకే. నారక్తంలోంచి, నాచీములోంచి అతడు జన్మించేడు. కాని లోకానికి నేను పినతండ్రిని — బాబాయిని ... ఏడుగడను! అతని జీవితం ... నాపాపం ... దానిఫలం!

"బాబాయి! మా అమ్మముఖం చూడు ... ఆమెను ఆలోచించు ... నన్ను చూడు ... హృదయంలో శాంతిలేక అల్లాడిపోతున్న నన్ను చూచైనా జరిగింది చెప్పు బాబాయి! చెప్పు."

నారామూ...ఎన్నాళ్లనుంచో—పదహారుసంవత్సరాలనుంచి తోడుచెప్పకొని కొంత భారాన్నైనా తగ్గించుకొందామని చూస్తూ, పడయలేక కుమిలిపోతూ ఉన్న నాకథను ... ఎంత ఆపదొచ్చినా చెప్పకూడని సంగతిని, అంశాన్ని ... అందులో రామూకు ... అతను కన్నీరు కారుస్తుంటే చూడలేక, వెర్రిఆశతో, అతను శాంతి పొందుతాడని ... నాహృదయం పట్టలేకుండా ఉన్నందున ... ఆభారాన్ని తగ్గించుకొందామన్న మైకమైన ఆత్రుతలో చెప్పేను. ఆకథలోనే క్షమార్పణ కూడా ... అర్హత కాకపోయినా ... అడిగేను.

ఆ రాత్రి అతని గదిలోకి తీసుకెళ్లి నిద్రపుచ్చేను ... తలుపు మూసి వస్తుంటే దూరాన తీతువుపిట్ట అరపు వినిపించింది.

ఒక్కసారిగా వణకిపోయేను ... మృత్యువు నాయింటిమీద ఇంకా నాట్యం చేస్తోందా?

* * *

ఆ సంఘటన జరిగిన- కొద్దిదినాలకే రామూ విషం తీసుకొని చచ్చిపోయేడు ... ఈపాపాత్ముడికి కుళ్లిపోతున్న హృదయానికి ... ఒక్కగా నొక్క ఆశపెట్టుకొని దానికొరకై విలపిస్తున్న అంధుడికి ఒక్క లేఖమాత్రమే రాసి వదిలేస్తూ:

"బాబాయి! ఇన్నాళ్లూ నన్ను పెంచేవు. పెద్దవాణ్ణిచేసేవు. ఎంతో ఎక్కువగా... ఆఖరుకు నీపిల్లలకంటె ఎక్కువగానే ప్రేమించేవు. జీవితం సాఫీగా తన మార్గంలో తానుపడి వెళ్లినంతకాలం సంతోషంగా వెళ్లుతుంది. అది దారితప్పిందా, చెడిందా, ఇంక ఆ మార్గమే, ఆశకటమే, ఆ బండీఎద్దులే ఎదురు తిరుగుతాయి. రంకవేస్తాయి ... నీహృదయానికి, గాయాలు తగిలి నడవలేని స్థితిలో, ఈ జరాభారంలో, ఈ ముదుసలి తనంలో, గాయం చెయ్యకుండా, కుంగతీయకుండా, శేపకుండా వెళ్లలేకపోయినందుకు క్షమించు. ఎంతో ఆలోచించేను ... ఆఖరుకు కర్తవ్యం నిర్ణయించేను ... నన్ను క్షమిస్తావుకాదూ నాన్నా!

నీ పుత్రుడు—రామూ"

మృత్యు గృహంలోకి, దాని ప్రాంగణంలోకి వెళ్లబోయే ముందరకూడా ఈ కృతఘ్నుడికి, తుచ్ఛుడికి ఆ ప్రేమ చూపించకుండా ఉండలేకపోయేడు రామూ! ఇల్లాంటి మృత్యు దేవతని – తల్లిని కొడుకును కూడా తన పొట్ట పెట్టుకొన్నవాడిని ఇంకా గౌరవము, ఆదరణ, క్షమ కోరడం విడవలేకపోయేడు!

"నన్ను క్షమిస్తావు కాదూ నాన్నా!"

'నాన్నా!' హృదయం పగిలిపోయేది. క్షమించవలసినది అతను...ఇప్పుడు నేనే క్షమించాలా? నేనే అతన్ని, అతని చర్యను క్షమించాలా?

ఆ స్మశానంలో—

అరూప్రక్కనే...నా బాహువుల్లో జీవము పొంది, నా అంగణంలో పెరిగి పెద్దవాడై, నా పాపం వల్ల తను అనుభవించిన నా కొడుకు...నా రామూను నేనే కొమ్ము మోస్తూ, నేనే ఆ తల్లితులసిదగ్గర గొయ్యి తీసి, చితి పేర్పించి, నాచేతులతో–నాఈ హస్తాలతో, నా ఈ కృత్రిమ బాసలు చేసి మోసపుచ్చినవాట్లతో అంటించేను...నిప్పు పెట్టేను...మట్టి చేసేసేను. మళ్లీ ఈ ప్రపంచకంలో కనపడకుండా, ఇందులో గాలి పీల్చుకోకుండా, ఇందులో తిరగకుండా, దీనికి కనపడకుండా చేసేసేను. అన్నీ నేనే ... పుట్టించడం, చంపడం, మట్టి చెయ్యడం!

ఆరోజు నడపీనుగునే అయి వచ్చేను.

* * *

కాలం నెమ్మదిగా కుంటుతున్నట్లుగా జరిగిపోతోంది.

కాలం నెమ్మదిగానే తన పని తాను నిర్వర్తింప చేసింది. ఆ కాలమే స్వర్గం చూపించింది. అనుభవింప జేసింది. ఆనందింప జేసింది! పెంచింది, పెరిగించింది. ఈనాడు శరీరంలో వుండే ప్రతీబొట్టూ, ప్రతీ చుక్కా రక్తాన్ని పీల్చేసింది... అస్థి పోగుల్నే... ఊపిరి పీలుస్తూ, జరిగిపోయిన ఘట్టాలు మరపు రాకుండా శక్తియిచ్చి, అవే అన్ని అవస్థల్లోనూ స్ఫురించేటట్లుగా, ఎదురుగా కనపడేటట్లు నా హృదయంలో ప్రతీ ఎముకమీద, ప్రతీ కీలుమీద, ప్రతీ అంగం మీదా చిత్రించి, చూస్తో "నీ పాప ప్రపంచకంలో నృత్యం చేసుకో" అంది. "అప్పుడు స్వర్గం చూచేవు, ఇప్పుడు నరకం చూడు. అప్పుడు సుఖించేవు, ఇప్పుడు దుఃఖించు. అప్పుడు కులుకు లాడేవు, ఇప్పుడు వలవల్లాడు" అంది. కాలం...అన్నీ కాలమే చేసింది!

దశరథుడు ముని పుత్రుణ్ణి చంపేడు...ఆయవ్వనంలో. దాని ఫలితంగా తర్వాత తన ముదుసలితనంలో తన ఎదురుగా కొడుకులు అడవి కెళ్లేరు. భార్య ఎదురు తిరిగింది. దుఃఖంతో మరణించేడు. ఆ పాప ఫలం ఆతన్ని జీవనం అంతా అనుభవింపజేసింది. ఆఖరుకు మృత్యువును ఇచ్చింది. అల్లా అనుభవించేడు.

ఈ రోజున నేనుకూడా ఈ ముసలి తనంలో... యవ్వనంలో చేసిన ఉద్ధృతానికి, మోసానికి, పాపానికి అనుభవిస్తున్నాను. గురి అవుతున్నాను. ఫలం రుచి చూస్తున్నాను.

కాని అనుభవం చాల దన్నట్లుగా, ఇంకా బ్రతికి...శరీరంలో జవ సత్తువులు ఊడినా... ఒక్కరూ కనికరించకుండా, జాలిలేకుండా ఓదార్పు పొందకుండా ఆ జరిగిన అంశాలు నృత్యం చేస్తుంటే, మరణం కూడా దూరమై, జీవచ్ఛవమై కాలంగడుపుతున్నాను. బ్రతికి వున్నాను.

పాపం చేసేను...దాని ఫలం అనుభవిస్తున్నాను.

